క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీఓ



ఎమ్మెల్యే శంబంగితో ఎంపీడీఓ ఆంజనేయులు

బొబ్బిలి: ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన పీవీఎస్‌జే ఆంజనేయులు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు తప్పనిసరి

తెర్లాం: విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞానశిబిరంలో భాగంగా ఇంగ్లిష్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంగ్లిష్ పదాలను ఎలా గుర్తుంచుకోవాలి, ఎలా పలకాలో వివరించారు.

సచివాలయం సందర్శన

వంగర: మండలంలోని వీవీఆర్‌పేట సచివాలయాన్ని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు, ప్రజలకు అందిస్తున్న పౌరసేవలపై ఆరా తీశారు. వీవీఆర్‌పేట, జేకే గుమ్మడ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ, వైఎస్సార్ బీమా నమోదు, గృహ నిర్మాణాలపై సమీక్షించారు.

ఉపాధి పనుల పరిశీలన

రేగిడి: ఉపాధి పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని కొమిర, లక్ష్మీపురం, ఆడవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు పనులకు వచ్చి కొలతల ప్రకారం పనులు చేయకుంటే గిట్టుబాటు వేతనం ఎలా వస్తుందన్నారు. ప్రభుత్వం ప్రతి ఒక్క వేతనదారునికి రెండు పూటలా పనిచేస్తే రూ.272లు ఇస్తుందన్నారు. ఈ సమయంలోనే ఉపాధి పనులు చక్కగా చేసుకుంటే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

నవధాన్యాలతో నేల సారవంతం



నవధాన్యాల కిట్లను రైతులకు అందజేస్తున్న ఏఓ

రాజాం సిటీ: నవధాన్యాల సాగుతో పంటకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయని వ్యవసాయాధికారి ఎం.రేణుకాసాయి అన్నారు. మండలంలోని కంచరాం ఆర్బీకే వద్ద బుధవారం రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవధాన్యాలతో భూసారం పెరగుతుందని, పంటకు కావాల్సిన సూక్ష్మ, స్థూల పోషకాలు పుష్కలంగా అందుతాయన్నారు. ఫలితంగా పంట దిగుబడి పెరుగుతుందన్నారు. ఎకరాకు 13 కిలోల విత్తనాలు అవసరమవుతాయన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రేగిడి: పోషక విలువలున్న ఆహారాన్ని తింటేనే ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని బూరాడ, రేగిడి, ఉనుకూరు సెక్టార్ల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఏ సమస్య వచ్చినా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

తాగునీటిని వృథా చేయొద్దు



బొడ్డవలసలో కుళాయిలను పరిశీలిస్తున్న ఏఈ

రేగిడి: గ్రామాల్లో కుళాయిల ద్వారా వస్తున్న తాగునీటిని ప్రజలు వథా చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ కోరారు. మండలంలోని చిన్నయ్యపేట, సంకిలి, బొడ్డవలస తదితర గ్రామాల్లో తాగునీటి కుళాయిలను పరిశీలించారు. వేసవిలో అన్ని గ్రామాలకు తాగునీరు అందేవిధంగా చర్యలు చేపడుతున్నామని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కుళాయిల వద్ద బట్టలు ఉతకడం, కుళాయిలకు పైపులు పెట్టి నీటిని తరలించడం వంటివి చేయకూడదని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రేగిడి: మండలంలో సంకిలి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంకిలి గ్రామానికి చెందిన సూరు కుమారస్వామి ద్విచక్రవాహనంపై పాలకొండ నుంచి రాజాం వైపు వస్తుండగా.. కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి క్షతగాత్రుడిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

- కలెక్టర్ నాగలక్ష్మి
- రామభద్రపురం, బాడంగి మండలాల్లో సుడిగాలి పర్యటన



బాడంగి: కామన్నవలస మంగలిబందలో ఉపాధిహామీ వేతనదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి



రామభద్రపురం : పీహెచ్‌సీలో వైద్యాధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రామభద్రపురం: విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్. అన్నారు. మండలంలో బుధవారం ఆమె సుడిగాలి పర్యటన చేశారు. మొదట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు, స్టాక్ పాయింట్ పరిశీలించారు. మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి..? ఎంతమంది పిల్లలు ఉన్నారు..? తదితర వివరాలను ఎంఈఓ తిరుమలప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో చేరిన పిల్లలందరికీ విద్యాకానుక కిట్లు తప్పనిసరిగా అందేలా చూడాలన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డులు, డెలివరీ గది, ల్యాబ్‌లను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో వైద్యాధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం నాయుడువలస సచివాలయం, చెత్తశుద్ధి కేంద్రం పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, భూముల రీ సర్వేపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భూశాయవలస, నరసాపురం గ్రామాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శేషశైలజ, ఎంపీడీఓ రమామణి, తహసీల్దార్ రాజారావు, ఈఓపీఆర్డీ వెంకటరమణ, సర్వే డీటీ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

బాడంగిలో...

బాడంగి: మండలంలో కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం పదిన్నర గంటలకు బాడంగి చేరుకున్న కలెక్టర్ నాగలక్ష్మి నేరుగా కామన్నవలస మంగలిబందలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, వేతనదారులతో మాట్లాడారు. బిల్లులు సకాలంలో అందుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అక్కడ నుంచి గొల్లాది చేరుకున్న ఆమె తాత్కాలికంగా నిర్వహిస్తున్న సచివాలయాన్ని పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. పక్కా భవనాలు పూర్తికాకుండా, ఆన్‌లైన్‌లో పూర్తయినట్లు ఎందుకు చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపంలోని పాఠశాలలో నిర్వహిస్తున్న 104 వైద్యశిబిరాన్ని సందర్శించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అక్కడనుంచి డొంకినవలస గ్రామానికి చేరుకుని సచివాలయ భవన నిర్మాణ పనులు పరిశీలించి, అనంతరం గ్రామస్తులతో తాగునీటి సరఫరాపై చర్చించారు. అనంతరం బాడంగి సీహెచ్‌సీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల.. పిన్నవలసలోని సామూహిక మరుగుదొడ్లు.. అచ్చియ్యపేట సమీపంలోని కోడూరు భూముల రీ సర్వే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శేషశైలజ, పీఆర్ డీఈఈ అప్పారావు, ఉపాధి హామీ సామాజిక తనిఖీ ఆడిటర్ రవీంద్ర, ఎస్ఎస్ఏ జేఈ కిశోర్‌కుమార్, సీడీపీఓ.రాజ్యలక్ష్మి, హౌసింగ్ డీఈఈ. అప్పయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ అజీరఫిజాన్, ఈఓపీఆర్డీ.సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి ఆకాంక్ష



సంతకవిటి: లబ్ధిదారునకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని మందరాడ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ ఆరాతీశారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో గ్రామ సచివాలయాలు, గ్రామ వలంటీర్ వ్యవస్థలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. వారి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం, వాటిని అమలు చేయడంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. టీడీపీ హయాంలో భారీగా అక్రమాలు జరిగాయని, అదే జగనన్న పాలనలో ఇంతవరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. సొంతంగా మేనిఫెస్టోను కూడా తయారు చేయలేని అసమర్థ నాయకుడు చంద్రబాబునాయుడు అని దుయ్యబట్టారు. జగనన్న తన మేనిఫెస్టోలో 98శాతం పైన హామీలను అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించి వైఎస్ జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, స్థానిక ఎంపీటీసీ వి.వెంకటేశ్వరనాయుడు, వి.రామకృష్ణనాయుడు, గార ఉమ, యెన్ని శ్రీను, యడ్ల రామకృష్ణ, దాసరి దాలినాయుడు, ఆర్.జగన్, కె.రామకృష్ణంనాయుడు, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు వీవీఆర్‌పేటలో..

వంగర: మండలంలోని వీవీఆర్‌పేట పంచాయతీలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ తెలిపారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొనే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

గౌరవ వేతనం విడుదల



గౌరవ వేతనం బిల్లుపై సంతకం చేస్తున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: మండల ప్రజాపరిషత్ అధ్యక్షులతో పాటు ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులకు ఆరు నెలలకు సంబంధించిన గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని ఎంపీడీఓ రమామణి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె గౌరవ వేతనాలకు సంబంధించిన బిల్లులపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు 24 సెప్టెంబర్ 2021 నుంచి 30 ఏప్రిల్ 2022 వరకు 7 నెలల 7 రోజులకు గాను గత ఏడాది ఆగస్టులో 3,03,800 రూపాయలను ప్రభుత్వం విడుదల చేయగా తాజాగా 2022 మే నెల నుంచి 2022 అక్టోబర్ వరకు మరో ఆరు నెలల గౌరవ వేతనాలు విడుదలయ్యాయని తెలిపారు.

నేటి నుంచి గడప గడపకు...

మండల కేంద్రంలోని మూడు సచివాయాల పరిధిలో ఈ నెల 8వ తేదీ నుంచి ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభిస్తారని ఎంపీడీఓ రమామణి తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

98.5 శాతం హామీలు అమలు



వలంటీర్లను సత్కరిస్తున్న చైర్మన్, తదితరులు

బొబ్బిలి: ప్రజలకు ఇచ్చిన హామీల్లో 98.5 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణారావు అన్నారు. పట్టణంలోని 16వ సచివాలయం పరిధిలోని 30, 31వ వార్డుల వలంటీర్ల ను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ, వలంటీర్లు మరింత బాధ్యత గా పనిచేసి ముఖ్యమంత్రికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వాడపల్లి వనజా మనోజ్‌కుమార్, చోడిగంజి అనసూయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించండి

- మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మణరావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

తెర్లాం: మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఉపాధి హామీ పథకం చీపురుపల్లి ఏపీడీ వి.లక్ష్మణరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులతో ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతిపై ఆరా తీశారు. మండలంలోని మన బడి నాడు – నేడు పథకం ఫేజ్–2 కింద ఎన్ని పాఠశాలలకు పనులు మంజూరయ్యాయి.. ఆ పనుల ప్రగతి ఏవిధంగా ఉందని ఎంఈఓ త్రినాథరావు, ఎస్ఎస్ఏ ఏఈ రవికుమార్‌ను ప్రశ్నించారు. పనులు మరింత వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన కుటుంబ వైద్యుడు కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల వైద్యాధికారులకు సూచించారు. జగనన్న ఇళ్ల లేఅవుట్‌లలో విద్యుత్ సౌకర్యం త్వరితగతిన కల్పించేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యుత్ శాఖ ఏఈ జోగినాయుడును ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి ఆరిప్రపల్లి రాజశేఖర్, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల హర్షం

రాజాం సిటీ: వైద్యవిధాన పరిషత్‌ను సెకెండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్పుచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆ శాఖ ఉద్యోగులు జీవీ రాజ్యలక్ష్మి, ఎంసీహెచ్ నాయుడు, కె.హరిబాబు, కె.గోపాల్‌దాస్‌లు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత 35 సంవత్సరాలుగా వైద్యవిధాన పరిషత్ ఆశించిన లక్ష్యాలను, సర్వీసు నిబంధన ఏర్పాటు, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు వంటివాటిలో తీవ్రజాప్యం ఎదుర్కొందని పేర్కొన్నారు. పాత విధానంతో స్పెషలిస్టు వైద్యులు కూడా నియామకం తీసుకునేందుకు ముందుకు వచ్చేవారు కాదని, సర్వీసు నిబంధనలు పూర్తిస్థాయిలో జారీచేయకపోవడంతో కొంత అభద్రతకు గురయ్యేవారని తెలిపారు. ఈ విధానానికి స్వస్తిపలికి ప్రభుత్వశాఖగా గుర్తిస్తూ 010 పద్దు కింద జీతాలు చెల్లించేందుకు కేబినేట్ ఆమోదం తెలపడం ఆనందదాయమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బంగారమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

బాడంగి: మండలంలోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మ ఆలయ ప్రారంభోత్సవాలు బుధవారంతో ప్రారంభమయ్యాయి. పురోహితుడు ఆరవెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ధాన్యాధివాసం, యజ్ఞాధివాసం, జలాభిషేకం, ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బిల్లులు చెల్లించేలా చర్యలు

- చీపురుపల్లి డీఎల్‌డీఓ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, పక్కన ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మినీ గోకులాలు నిర్మించిన రైతులకు బిల్లులు చెల్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, చీపురుపల్లి డీఎల్‌డీఓ వి.లక్ష్మణరావు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అధ్యక్షతన ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, సచివాలయ పశు సంవర్థక సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2018–19 ఆర్థిక సంవత్సరంలో రైతులకు మినీ గోకులాలు మంజూరయ్యాయన్నారు. అప్పట్లో మండలంలో 117 మంది రైతులు మినీ గోకులాలు నిర్మించారని, వీటిలో 48 గోకులాలకు ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. మిగిలిన వాటికి బిల్లులు చెల్లించేందుకు గ్రామస్థాయి పరిశీలన చేపట్టి, వాస్తవాలు తెలుసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ మాట్లాడుతూ, గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీల ద్వారా సంపద సృషించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, ఈఓపీఆర్డీ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు



పళ్ల దుకాణం వద్ద పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న శానిటేషన్ కార్యదర్శులు

రాజాం సిటీ: సక్రమంగా విధులకు హాజరుకాని వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీచేశామని కమిషనర్ డీటీవీ కృష్ణారావు బుధవారం తెలిపారు. వార్డుల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకుండా విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తున్న కారణంగా క్రమశిక్షణ రాహిత్యం కింద నోటీసులు అందజేశామన్నారు. అదేవిధంగా పట్టణంలో పాలిథిన్ నిషేధానికి సంబంధించి శానిటేషన్ కార్యదర్శులు తూతూ మంత్రంగానే దాడులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా సచివాలయ డ్రెస్ కోడ్ కూడా లేకుండా దాడులు నిర్వహించడంపై విమర్శలు వస్తున్నాయి.

పరీక్ష కేంద్రం తనిఖీ

రాజాం: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదోతరగతి సప్లమెంటరీ పరీక్షలను ఎంఈఓ పాండ్రంకి నాగయ్య బుధవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో వసతుల కల్పనపై ఆరాతీశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించి, ఇన్విజిలేటర్లతో మాట్లాడారు.

జేవీకే కిట్ల పంపిణీ

రేగిడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను ఎంఈఓ ఎంపీ ప్రసాదరావు బుధవారం పంపిణీ చేశారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు వాటిని అందజేశారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి జేవీకే కిట్లను విద్యార్థులకు అందజేయాలని సూచించారు. ఈనెల 12లోగా ఈ కిట్ల పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి



మాట్లాడుతున్న శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు పట్నాయక్

రాజాం: శిష్టకరణ కులస్తులను ఓబీసీలో చేర్పించేందుకు కృషిచేస్తామని రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉరిటి అప్పారావు పట్నాయక్ అన్నారు. మెంటిపేట కాలనీ రోడ్డులో రాజాం ప్రాంతీయ శిష్టకరణ సంఘ సమావేశాన్ని అధ్యక్షుడు పక్కి వాసు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ శిష్టకరణాలు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ఓబీసీ రిజర్వేషన్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, అందులో భాగంగా శిష్టకరణ కులస్తుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రాంతీయ శిష్టకరణ సంఘం అమృతకలశం ద్వారా కులంలోని పేదలకు నిత్యవసర సరుకులు ప్రతీ నెల అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు రాజాం అప్పలనరసయ్య, సంఘ నాయకులు పక్కి అప్పలదాస్, బలివాడ సూర్యనారాయణ, వాండ్రంగి నాగభూషణరావు, కుప్పిలి సాయిరమేష్, బలివాడ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలతో ఉపాధికి ఎసరు

రాజాం: మండలంలో మొగిలివలస గ్రామం సమీపంలోని ఎరుకువాని చెరువు ఆక్రమణకు గురవుతోందని ఉపాధి వేతనదారులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ చెరువులో సుమారు 600 మంది వేతనదారులు ఉపాధి పనులు చేసేవారిని, కానీ ప్రస్తుతం ఆక్రమణలు కారణంగా చెరువు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. చెరువు గర్భాన్ని రాజాం పట్టణానికి చెందిన కొందరు వ్యాపారులు ఆక్రమించి భవన నిర్మాణాలు చేపట్టడంతో పాటు ప్లాటులుగా మార్చి విక్రయించేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చెరువులో ఉపాధి పనులు చేస్తుంటే భవన నిర్మాణదారులు అడ్డుకుంటున్నారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని అంటున్నారు. చెరువు ఆక్రమణకు గురవ్వడంతో ప్రస్తుతం పూర్తిస్థాయిలో వేతనదారులకు పని లభించని పరిస్థితి నెలకొందని గ్రామానికి చెందిన మజ్జి హరినాథరావు, లెంక వెంకటరమణ, ఆబోతుల శ్రీరాము తదితరులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

ఆర్‌బీకేలకు చేరుకున్న యురియా

రేగిడి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన ఎరువులను రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముందస్తుగా తీసుకువచ్చి భద్రపరుస్తున్నట్లు చెప్పారు. మండలంలోని చాటాయవలస, సోమరాజుపేట, అంబకండి తదితర గ్రామాల్లోని ఆర్‌బీకేలకు బుధవారం యూరియా బస్తాలు వచ్చాయి. వాటిని సిబ్బంది భద్రపరిచారు.

విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

- వ్యవసాయశాఖ విజయనగరం ఏడీఏ నాగభూషణం



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ నాగభూషణం

డెంకాడ: రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ విజయనగరం ఏడీఏ నాగభూషణం అన్నారు. మండలంలోని చొల్లంగిపేట ఆర్‌బీకేలో వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న సేవలపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు. నేలసారం తెలుసుకునేందుకు మట్టి ననమూనాలను సేకరించి వాటి ఫలితాలను రైతులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందుల సరఫరా, పొలంబడిలో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే వైఎస్సార్ యంత్రసేవ ద్వారా యంత్రాలను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా రైతులకు విత్తనాల తయారీపై తగిన సహాయ, సహకారాలు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ కనకరాజు, ఏఓ పూడి నిర్మల, ఏఈఓ ప్రశాంతి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 57 మంది ఎంపిక

రాజాం సిటీ: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.అనూష, రోష్టారా అన్నారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సచివాలయాల్లో వృద్ధులకు ఆప్తాల్మిక్ అధికారి ఎస్.వసంతరావు కంటి పరీక్షలు చేశారు. 57 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వారిని బుధవారం విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించారు. వారందరికీ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ సురేష్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించాలని రైతుల ధర్నా

గంట్యాడ: గ్రీన్ ఫీల్డ్ హైవే (హరిత రహదారి)లో భాగంగా రోడ్డు నిర్మాణం వల్ల పంట పొలాలు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో కల్వర్టు నిర్మించాలని డిమాండ్ చేస్తూ పెంట శ్రీరాంపురం గ్రామ రైతులు గ్రామంలో బుధవారం ధర్నా చేశారు. రైతులు మాట్లాడుతూ వసంత, పెంటశ్రీరాంపురం గ్రామాలను ఆనుకుని నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో కల్వర్టు ఏర్పాటు చేయకుండా రోడ్డు వేయడం వల్ల పెంట శ్రీరాంపురంలో 50 ఎకరాల పొలం ముంపునకు గురవుతోందని వివరించారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు.